పరామర్శ



ఇందిరను పరామర్శిస్తున్న నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: మండలంలోని వింజం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు యేసుమణి ఇటీవల మరణించారు. ఇది తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ గురువారం యేసుమణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వీరకనెల్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఇందిర ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. మెరుగైన చికిత్సకు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోదండన్, జిల్లా బూత్ కన్వీనర్ వెంకటేష్, మాజీ సర్పంచ్ గోవిందయ్య, ఎంపీటీసీ హనీఫ్‌బాషా, నాయకులు కుట్టి, యువరాజ్, భాను తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో గురుపౌర్ణమి

పుత్తూరు: పట్టణంలోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము 2.30 గంటలకు సుప్రభాత సేవతో మొదలై మధ్యాహ్నం వరకు రాత్రి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం పాలాభిషేకం అనంతరం అన్నదానం చేశారు. రాత్రి 7 గంటలకు భాజాభజంత్రీలు, కోలాటాలు, భజనల నడుమ పురవీధుల్లో బాబాను ఊరేగించారు.ఆ తర్వాత పవళింపు హారతి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే, శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలోని శ్రీకృష్ణునికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు నిర్వహించారు.

నగరిలో..

నగరి: మునిసిపల్, మండల పరిధిలోని సాయినాథుని ఆలయాల్లో గురుపూర్ణిమ ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. భేరివీధిలోని షిరిడి సత్యసాయి ఆలయంలో మహా పాలాభిషేకం చేశారు. హారతి పూజల్లో పలువురు భక్తులు సాయినాథుని దర్శించుకున్నారు. సాయిసత్యవ్రతం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..

పుత్తూరు: మహాభారతాన్ని రచించిన వ్యాస మహర్షి జన్మదినాన్ని గురు పౌర్ణమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. గురువారం కళాశాలలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో గురువుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వారి గురువులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశన్, నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

పెనుమూరు(కార్వేటినగరం): చిత్తూరు–పెనుమూరు జాతీయ రహదారిలో ఉన్న వాగ్దేవి సవితా సేవాశ్రమంలో గురువారం ఆషాఢ శుక్ల పౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుపరంపర ఆధ్యాత్మికతను జనవాళికి అందజేసిన గురుదేవుల చిత్రపటానికి భక్తులు పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ అధినేత స్వామిజీ పూజానంద, బ్రహ్మచారిణి అనంతమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆశ్రమ పూజారి హరగోపాల్, పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: స్థానిక సాయిబాలాజీ నగర్‌లోని షిరిడీ సాయినాథుని ఆలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు చేశారు. మూల విరాట్‌ను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి బాబాను దర్శించుకున్నారు. అనంతరం గురుపౌర్ణమి వ్రతం చేపట్టారు. ఇందులో సుమారు వంద మందికి పైగా దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం వెయ్యి మందికిపైగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బాలజీ, ఎంపీపీ లత, కమిటీ సభ్యులు రాజశేఖర్, చిరంజీవిరెడ్డి, పయణిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని మూలురు గ్రామంలోవున్న ఇరగలమ్మ ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ధర్మకర్త శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

బాల గురునాదీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని రాచపాల్యం గ్రామంలో వెలసిన బాల గురునాదీశ్వర స్వామికి గురువారం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వేద పండితులు వివిధ అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.





సాయిబాబాకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు, కార్వేటినగరం: గురుపౌర్ణమి వ్రతమాచరిస్తున్న భక్తులు

కుటుంబాలకు అండగా వైఎస్సార్ సీపీ



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

- మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. పుత్తూరు మండలం పైడిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సదాశివరెడ్డి కుమారుడు మధుసూదనరెడ్డి ఇటీవల హఠాన్మరణం చెందారు. గురువారం ఆర్కే రోజా గ్రామానికి వెళ్లి మధుసూదనరెడ్డి కర్మక్రియల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కలిగిరి వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

- నేడు అంకురార్పణ

తిరుపతి అన్నమయ్య సర్కిల్: చిత్తూరు జిల్లా కలిగిరికొండ కలిగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు మండలాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం అంకురార్పణతో ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. గురువారం టీటీడీ అధికారులు పత్రికా ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హేమలత

పాలసముద్రం: విద్యార్థులు ఇష్టపడి చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరుకుంటారని ప్రిన్సిపాల్ హేమలత తెలిపారు. పాలసముద్రం జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఇంటర్ విద్య ముఖ్యమని తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ జాబితా

నగరి: అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో అందరికీ అందుబాటులో ఉంచినట్టు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. సౌభాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ. 20 వేలు మూడుసార్లు అందజేస్తుందని, ఈ నెలాఖరులోపు మొదటి విడతగా రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 2 వేలు జమ చేయనుందన్నారు. నియోజకవర్గంలోని మండలాల రైతులు అర్హత ఉండి జాబితాలో పేర్లు లేనట్లయితే రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా గ్రీవెన్స్ వెబ్‌సైట్‌లో ఈనెల 13వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

శ్రీరంగరాజపురం: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ థామస్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ప్రారంభించారు. 49 కొత్తపల్లిమిట్టలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.5 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడ, ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం కటికపల్లెలో 'సుపరిపాలన' కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌మురళీ, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంఈవో అరుణాచలంరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల చదువు తల్లిదండ్రుల బాధ్యత

కార్వేటినగరం: విద్యార్థుల చదువును తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలని తహసీల్దార్ నాగరాజు అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పిల్లలను బడికి పంపించి చేతులు దులుపుకోవడం కాకుండా వారు ఎలా చదువుతున్నారో టీచర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. అలాగే, ఆర్కేఎస్సార్, కత్తెరపల్లి, డీఎం పురం, కేఎం పురం, పాదిరికుప్పం, కొల్లాగుంటలో పాఠశాలల్లోనూ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై సమగ్ర సర్వే

కార్వేటినగరం: ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులపై బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సర్వే చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు శిక్షణలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ నాగరాజు, డీటీ త్యాగరాజు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పుత్తూరు: స్థానిక కామరాజునగర్‌కు చెందిన ఆర్ముగం (55) గేట్ పుత్తూరులోని కేబిన్ వద్ద ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. అతని నుంచి సుమారు రూ.4 వేల విలువ చేసే 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు.

విద్యాలయాల్లో పేరెంట్స్ మీట్



ఎం.కొత్తూరులో నిర్వహిస్తున్న లెమన్ స్పూన్ పోటీలు

నగరి: మున్సిపల్, మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ మీట్‌ను నిర్వహించారు. చింతలపట్టెడ వినాయకపురం జెడ్పీ హైస్కూల్లో ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం నిర్వహించిన పేరెంట్స్ మీట్‌లో మునిసిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, టీచర్లు పాల్గొన్నారు. పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కృష్ణయ్య ముఖ్యఅతిథులుగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎంలు, టీచర్లు, పాఠశాల కమిటీల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.